క్లుప్తంగా

కూటమి పార్టీలకు పుట్టగతులుండవు

● పీసీసీ అధికార ప్రతినిధి సైదా

పొదిలి: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు మద్దతుగా ఓటు చేయాలని ఆయా పార్టీలు విప్ జారీ చేయటం దుర్మార్గమైన చర్య అని పీసీసీ అధికార ప్రతినిధి షేక్.సైదా ఒక ప్రకటనలో విమర్శించారు. భవిష్యత్‌లో ఆ పార్టీలకు పుట్టగతులు లేకుండా ప్రజలు చేస్తారని తెలిపారు. లౌకిక వాద, ప్రజాస్వామ్యవాద పార్టీలుగా చెప్పుకునే టీడీపీ, జనసేన పార్టీలు ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం నీతిమాలిన చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆయా పార్టీల్లో పనిచేస్తున్న ప్రజాస్వామ్య లౌకికవాదులు, ముస్లిం మైనారిటీ నాయకులు పార్టీలను వదిలిపెట్టాలన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి పంచాయతీలో బుధవారం సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ పంచాయతీ పరిధిలో ఇవ్వాల్సిన పింఛన్ నగదు పోయిందని మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 1వ తేదీ గ్రామస్తుల్లో చాలా మందికి పింఛను పంపిణీ కాలేదు. దీంతో ఎంపీడీఓ, ఇతర అధికారులు బుధవారం సిబ్బందిని గ్రామానికి పంపి పింఛను పంపిణీ చేయించారు.

ప్రభుత్వ న్యాయవాదిగా షబ్బీర్



పొదిలి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా షేక్.షబ్బీర్ నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి నియామక పత్రం అందుకున్నారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ధర్నాసి రామారావు ఉన్నారు. తన నియామకానికి సహకరించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు. షబ్బీర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఉడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసచారి

పొదిలి: స్థానికంగా ఉడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయటం ద్వారా ఎక్కువ మందికి ఉపాధి మెరుగుపర్చుకునే సౌకర్యం కలుగుతుందని విశ్వ బ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి అన్నారు. స్థానిక కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచర్ల శేఖర వర్క్ షాపు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ ఏర్పాటుతో పాటు రాయితీతో విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉడ్ కాంప్లెక్స్ ప్రాధాన్యత గురించి వివరించారు. విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన చేతి వృత్తిదారులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఫణిదపు సుధాకర్, యూత్ అధ్యక్షుడు తోపాటి జనార్ధనాచారి, రాష్ట్ర నాయకులు పొన్నపల్లి బ్రహ్మానందం, రాచర్ల రాజశేఖర్, ఉప్పుటూరి నారాయణస్వామి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

కొమరోలు: ప్రమాదవశాత్తు వరిగడ్డి వామి అగ్నికి ఆహుతైన సంఘటన కొమరోలు మండలంలోని కసినేపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డికి చెందిన వరిగడ్డి వామికి అన్యాహ్య రీతిలో మంటలు అంటుకోవడంతో కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. దాదాపు 15 వేల రూపాయలు నష్టం సంభవించినట్లు బాధితుడు తిరుపతిరెడ్డి తెలిపారు.

అర్బన్ కాలనీలో సమస్యలపై ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

కంభం: స్థానిక అర్బన్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. సమస్యలపై పాలకులు స్పందించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కాలనీ మహిళలు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి 40 ఏళ్లు అవుతున్నా నేటికీ డ్రెయినేజీ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. మురుగు రోడ్లపై, గృహాల ముందు నిల్వ ఉండటంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామన్నారు. మంచినీటి పైపులైన్లు పగలడం, లీకేజీల వల్ల కుళాయిల నుంచి దుర్వాసనతో కూడిన మురుగు నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదలు నివసించే కాలనీల అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు తోట తిరుపతిరావు, మండల నాయకులు షేక్ అన్వర్, బి.రోశయ్య, టి.దానం, గురవయ్య, శ్రీను, షేక్ మస్తాన్‌వలి, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఈకేవైసీకి ఆధార్ చిక్కులు

● ఆధార్ కేంద్రాలు పనిచేయక అవస్థలు పడుతున్న ప్రజలు
● పాఠశాలలు మానేసి కేంద్రాల వద్ద పడిగాపులు
● పట్టించుకోని అధికారులు



కందులాపురం-2 సచివాలయం వద్ద చిన్నపిల్లలతో తల్లిదండ్రుల పడిగాపులు

కంభం: రేషన్ కార్డుల్లో ఉండే చిన్నారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్న నిబంధన విధించడంతో కార్డుదారులు హైరానా పడుతున్నారు. ఈకేవైసీ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించినా కార్డుదారుల్లో ఆందోళన మాత్రం వీడలేదు. మాడు పగిలే ఎండలో రేషన్ షాపుల వద్దకు వెళ్లి పిల్లల ఈకేవైసీ చేయించుకునేందుకు ప్రయత్నించిన తల్లిదండ్రులకు అక్కడ మరో కొత్త సమస్య ఎదురవుతోంది. నూతన ఆధార్ కార్డు నమోదు సమయంలో పిల్లల వేలి ముద్రలు తీసుకోకుండా బాల ఆధార్ కేటాయిస్తారు. ఐదేళ్ల తర్వాత వేలి ముద్రలు తీసుకుంటామని, ఆధార్ అప్‌డేట్ చేయించాలని స్పష్టం చేస్తారు. ఇప్పుడు ఈ అంశమే రేషన్ కార్డు ఈకేవైసీకి అడ్డు తగులుతోంది.

పనిచేయని ఆధార్ కేంద్రాలు

కంభం, అర్ధవీడు, బేస్తవారిపేటలోని గ్రామ సచివాలయాల్లో 9 ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయగా కేవలం మూడు మాత్రమే పని చేస్తున్నాయి రోజుల తరబడి తిరిగిన పని జరగడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. కందులాపురం-2 సచివాలయంలో ఉన్న ఆధార్ సెంటర్ వద్ద విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో వస్తుండటంతో అక్కడ టోకెన్ పద్ధతి పెట్టి రోజుకు 30 మందికి చొప్పున చేస్తున్నారు. కంభం మండలంలో కంభం-2 సచివాలయం, కందులాపురం-2 సచివాలయం, పెద్దనల్ల కాల్వ సచివాలయంలో మాత్రమే ఆధార్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. గత 8 నెలలుగా కంభం-2 సచివాలయం పరిధిలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ మెడికల్ లీవ్‌లో ఉండటంతో అక్కడ సర్వీసులు ఆగిపోయాయి. పెద్ద నల్ల కాల్వ సచివాలయం వెళ్లాలంటే స్థానికంగా ఉండే వారికి, చుట్టు పక్కల గ్రామాల వారికి దూరమవుతోంది. అర్ధవీడు మండలం కాకర్లలో ఆధార్ సేవలు అందుబాటులో ఉండగా అది కూడా దూర ప్రాంతం కావడంతో అక్కడికి వెళ్లేందుకు ప్రజలు సుముఖత చూపడం లేదు. ఇక బేస్తవారిపేట మండలంలో ఉన్న మూడు కేంద్రాలు పనిచేయకపోవడంతో అక్కడి వారు కూడా కంభం రావాల్సిన పరిస్థితి. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపకుండా గంటల తరబడి కందులాపురం కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. గతంలో పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఆధార్ సర్వీసులు అందుబాటులో ఉండటంతో ప్రజలు అక్కడ సేవలు పొందే వారు. ప్రస్తుతం అక్కడ కూడా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. కేంద్రాలు ఉండి సర్వీసులు అందని చోట ఇతర ఉద్యోగులను డిప్యుటేషన్‌పై నియమించి ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కంప్యూటర్ గదిలో గుమిగూడిన పిల్లలు

చర్యలు తీసుకుంటాం

ఎంపీడీఓలతో మాట్లాడి ఆధార్ సర్వీసులు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. నిరుపయోగంగా ఉన్న కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, డీఎల్‌డీఓ మార్కాపురం



ఉన్నగురువాయిపాలెం పొలాల్లో విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన తీగజాతి మొక్కలు



అన్నవరం పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి ఇదీ..

అల్లుకున్న నిర్లక్ష్యం!

పొదిలి రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఉన్నగురువాయిపాలెం మద్యం దుకాణం సమీపంలోని పొలాలు, తుమ్మగుంట, గురుగుపాడు పొలాల్లో, అన్నవరం, ఆముదాలపల్లి పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈదురుగాలు వీచినప్పుడల్లా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని రైతులు చెబుతున్నారు. వర్షం కురిసే సమయంలో తీగ జాతి మొక్కలకు విద్యుత్ సరఫరా అయితే మనుషులు, జీవాలకు ప్రాణాపాయం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తుమ్మగుంట పొలాల్లో స్తంభంపై ఎండిన మొక్కలు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించండి



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: రాష్ట్రంలోనే పేరుగాంచిన భూదేవి శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భక్తులకు సేవలు అందించాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా సాగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవల సమయంలో సేవలందించాలని సూచించారు. భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ అధికారులకు అన్నివిధాలా సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీ బేగ్, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, షెక్షావలి, పట్టణ పార్టీ కార్యదర్శి శేషయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, కరీం బాషా, చెన్నారెడ్డి, నల్లబోతుల కొండయ్య, మల్లిక, కాలువ దుర్గ, పోరుమామిళ్ల విజయలక్ష్మి, డీవీఆర్, ఉస్మాన్ బాషా, బూదాల సతీష్, మందటి మహేశ్వరరెడ్డి, గౌస్ మొహిద్దీన్, రంగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని ఆవులు ఎక్కడ?

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ట్యాంకు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గోశాలలో ఉండాల్సిన ఆవులు గత రెండు రోజుల నుంచి కనిపించకపోవడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. నాలుగు నెలల క్రితం మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న గోవులను వాటర్‌ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక గోశాలలో ఉంచారు. పలువురు దాతలు వాటికి గ్రాసం, నీళ్లు అందిస్తున్నారు. అయితే గత రెండు రోజుల నుంచి తాత్కాలిక గోశాలలో ఆవులు కనిపించడం లేదనే విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై కమిషనర్‌ను బుధవారం మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ప్రశ్నించగా.. రెండు రోజుల క్రితం కొన్ని ఆవులు అనారోగ్యంగా ఉన్నాయని, కొంత మంది పెంచుకుంటామని అడగడంతో అప్పగించామని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.



గోవులు లేక ఖాళీగా ఉన్న తాత్కాలిక గోశాల

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమరోలు: మండలంలోని రాజుపాలెం కేజీబీవీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.రోజ్ సులోచన సూచించారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనాథలు, సింగిల్ పేరెంట్ ఉన్న వారు, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 7, 8, 9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను కూడా త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోలేని వారు విద్యార్థుల వివరాలతో కేజీబీవీలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యంలో పురుగులు



పురుగులు ఉన్న బియ్యం చూపిస్తున్న కార్డుదారులు

పొదిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వీధిలో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పురుగులు ఉండటంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ముక్కిపోయిన, పురుగులు ఉన్న బియ్యం ఇస్తుండటంతో ఎలా తినాలని ఎండీయూ ఆపరేటర్లను పేదలు నిలదీశారు. అధికారులు స్పందించి మంచి బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

విద్యుత్ లైను ప్రారంభం



నూతన లైనును ప్రారంభిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

కొనకనమిట్ల: మండలంలోని పొదిలి రోడ్డులో చిన్నారికట్ల సబ్‌స్టేషన్ వరకూ ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ లైనును విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన లైన్‌ను ప్రారంభించారు. దీని వలన కొనకనమిట్ల, చౌటపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరనుందని ఈఈ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఏ వీరయ్య, హరిబాబు, ఏఈ వీరబ్రహ్మం సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యపై దృష్టి సారించాలి

కంభం: మండలంలో నీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ వీరభద్రాచారి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కంభంలోని పలు వీధుల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని, పారిశుధ్యం అధ్వానంగా మారిందని, పంట కాలువల్లో మురుగు తీసి అక్కడే వదిలివేస్తున్నారని సర్పంచ్ పల్నాటి బోడెయ్య, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం సభ దృష్టికి తీసుకొచ్చారు. పెద్ద కంభం తూము వద్ద లీకేజీతో నీరు వృథాగా పోతోందని, సూరేపల్లిలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్‌ను ఉపయోగంలోకి తేవాలని సర్పంచ్ కోరారు. ఈనెల 31వ తేదీ నాటికి ఐదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ నిలిపివేస్తామని తహసీల్దార్ వి.కిరణ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, వైస్ ఎంపీపీ రామ్మూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్

జగనన్న కాలనీల్లో రీ సర్వే

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల జగనన్న కాలనీలో బుధవారం వీఆర్‌ఓల ప్రత్యేక బృందం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. జగనన్న కాలనీలో అనర్హులు ఉన్నారా? ఎంత మంది ఇంటి నిర్మాణం చేపట్టారు?, ఖాళీ స్థలాలు ఎన్ని ఉన్నాయి తదితర అంశాలపై వీఆర్‌ఓలు విచారణ చేపట్టి జాబితాలు తయారు చేస్తున్నారు. దీంతో నివేశన స్థలాన్ని పొంది ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఇల్లు నిర్మించుకోలేకపోయిన నిరుపేదల్లో ఆందోళన మొదలైంది. ఎక్కడ తమకు ఇచ్చిన స్థలాలను వెనక్కి లాగేసుకుంటారోనని పేదలు ఆందోళన చెందుతున్నారు. సగం మేర ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రీ సర్వేతో ప్రయోజనం ఏమిటనే ప్రశ్నలకు అధికారుల వద్దే సమాధానం లేకపోవడం గమనార్హం. అనర్హత పేరుతో స్థలాలు వెనక్కి తీసుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేదలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో వీఆర్‌ఓలు వై.పి.రంగయ్యయాదవ్, శేఖర్‌రెడ్డి, మీనిగ ఆంజనేయులు, రామలింగయ్య, సచివాలయ సిబ్బంది ఖాజా, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో ఓ ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రైతులు అందుబాటులో ఉండాలి

బేస్తవారిపేట: భూముల రీ సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ జితేంద్రకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని జేబీకే పురంలో రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేబీకే పురంలో 966 ఎకరాల్లో రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి 461 ఎకరాలు, ప్రైవేట్ భూమి 504 ఎకరాలు ఉందని వివరించారు. గురువారం నుంచి ప్రభుత్వ భూమి సర్వే జరుగుతుందన్నారు. రైతులు భూమి హక్కు పత్రాలు సర్వే సమయంలో అందజేయాలని కోరారు. గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ షేక్ సలీమ్‌బాషా, సర్వేయర్ కె.నాగేశ్వరరెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ జితేంద్రకుమార్

పాస్టర్ మృతిపై శాంతియుత ర్యాలీ



బేస్తవారిపేటలో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

బేస్తవారిపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఐక్య పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాస్టర్స్, క్రైస్తవుల ఆధ్వర్యంలో బుధవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్లకార్డులు పట్టుకుని భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ వేశపోగు బాలు మాట్లాడుతూ.. పాస్టర్లపై, ప్రార్థనా మందిరాలపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని కోరారు. పాస్టర్ తోటకూరి పీటర్ మాట్లాడుతూ.. ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపి వారి కుటుంబానికి తగిన న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య, పాస్టర్లు శామ్యూల్ రామచంద్ర, పి.మహేష్‌బాబు, జి.జోసఫ్, టి.జాన్ విల్సన్, వేశపోగు భరణి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల కబ్జాకు టీడీపీ నేతల ప్రయత్నం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

● తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల ఆందోళన

మార్కాపురం: మార్కాపురం మండలం రాయవరం వద్ద 2009లో పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రాయవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని లబ్ధిదారులు బుధవారం మార్కాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సదరు టీడీపీ నేత దొంగ పాసుబుక్కులు తయారు చేసుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, అతని మాటలు నమ్మి అధికారులు తమ పట్టాలు రద్దు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సదరు టీడీపీ నేత పేదల స్థలాలపై కన్నేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలకు దగ్గరగా తమ స్థలాలు ఉండటంతో వాటిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ షఫీ, పురుషోత్తం, రఘు, మస్తాన్, రవికుమార్, ఖాదర్‌బాషా, గౌస్, ఏసేబు, రజియా తదితరులు పాల్గొన్నారు.